ప్రమాదంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం

- వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత వామపక్ష, లౌకిక శక్తులదే
- దేశంలో వామపక్షాల ఐక్యత అత్యావశ్యకం
- మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లిన నేత ఏచూరి
- సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పెట్టుబడి దారీ వ్యవస్థ సమాజంలో శాంతిని సృష్టించదు. దేశంలోని నిరుద్యోగ సమస్యను తగ్గించదు. ఉపాధి చూపదు. ఆర్థిక అసమానతలను తగ్గించదు. ఇది నిజం. అంతిమంగా భవిష్యత్తు సోషలిజానిదే. అయితే, కొత్తతరంలో స్ఫూర్తిని నింపాలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయి. ఎమర్జెన్సీ రోజుల్లో కంటే ఎక్కువగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. భూస్వామ్య, రాచరిక వ్యవస్థలు రావాలని బిజెపి కోరుకుంటున్నది. ఇలాంటి సమయంలో సోషలిస్టు వ్యవస్థ కోసం వామపక్షాల కృషి మరింత పెరగాలి. వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత వామపక్ష, లౌకిక శక్తులదే. ఇలాంటి తరుణంలో దేశంలో వామపక్షాల ఐక్యత అత్యావశ్యకం' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి రాఘవులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీతారాం ఏచూరి, కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మరణానికి సంతాప సూచకంగా సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. అనంతరం నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన 'ఓ సోషలిస్టు ఆచరణ పథం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత రాఘవులు మాట్లాడుతూ... బిజెపి ఫాసిస్టు, మతోన్మాద ధోరణి నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భారత రాజకీయాల్లో పెనుమార్పులు, పెడధోరణలు వస్తున్న తరుణంలో అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్యశక్తుల పాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఏచూరి లేనిలోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎన్ని


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బివి రాఘవులు, తమ్మినేని, జాన్‌వెస్లీ తదితరులు

ఒడిదుడుకులు ఎదురైనా ఏచూరి మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకెళ్ళారనీ, ఆయన స్ఫూర్తితో యువతరం ముందుకు కదలాలి అని పిలుపునిచ్చారు. ఏచూరి మరణాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నామని చెప్పారు. దేశంలో ప్రతిపక్ష పార్టీల నేతలను పోటీచేయకుండా, ఉన్నవారిని పదవీచితులను చేసే ప్రయత్నాన్ని బిజెపి చేస్తోందని విమర్శించారు. కషాయ ప్రమాదాన్ని దేశ ప్రజలకు వివరించి చెప్పడంతో పాటు మరింత చైతన్యం కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఎన్ని భిన్నత్వాలు ఉన్నా ప్రతిపక్షాలన్ని బిజెపికి వ్యతిరేకంగా ఒకతాటిపైకి వచ్చాయంటే వామపక్షాలు, అందులోనూ సీతారాం ఏచూరి వల్లే సాధ్యమైందన్నారు. సంఘపరివార్ ఏకత్వం తప్ప భిన్నత్వం ఉండకూడదని చెబుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మతాన్ని అడ్డం పెట్టుకుని రాజ్యాంగాన్నీ, అన్ని ప్రభుత్వ వ్యవస్థలను మార్చుకుంటూ పోతున్న తీరును ఎండగట్టారు.

ఏచూరి నాలెడ్జ్, విజన్ పర్సన్ : సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

విద్యార్థి ఉద్యమం నుంచి ఏచూరితో ఉన్న అనుబంధాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి అజీజ్ పాషా పంచుకున్నారు. తాము పార్లమెంట్‌లో ఒకేసారి రాజ్యసభ సభ్యులుగా కొనసాగామనీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను అందరికీ అర్థమయ్యేలా పార్లమెంట్ సాక్షిగా ఎండగట్టేవారని గుర్తుచేశారు. కమ్యూనికేషన్, టూరిజం, కల్చరల్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మెన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తుచేశారు. 120కిపైగా దేశాలు పాల్గొన్న ఏథెన్స్ ఇంటర్నేషన్ కమ్యూనిస్టుల సభలో ఏచూరి డ్రాఫ్టింగ్ కమిటీ మెంబర్‌గా ఉన్నారనీ, తాను ప్రతినిధిగా హాజరయ్యానని చెప్పారు. ఏచూరికి సాహిత్యంపై మంచి పట్టు ఉండేదన్నారు. ఆర్ట్, సాహిత్యం, సంగీతం, రాజకీయం ఇలా అన్ని అంశాలపై పట్టున్న నాలెడ్జ్, విజన్ పర్సన్ ఏచూరి అని కొనియాడారు.

సెక్యులరిజం, సోషలిజం చుట్టే స్వాతంత్ర్య ఉద్యమం : తమ్మినేని వీరభద్రం

రాజ్యాంగం నుంచి సెక్యులరిజం, సోషలిజం పదాలను తీసేయాలని కొందరు మాట్లాడటాన్ని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం రాసినాడు ఆ పదాలు లేకపోవచ్చుగానీ ఆ రెండు పదాల చుట్టే దేశ స్వాతంత్ర్య ఉద్యమం నడిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వ పాలనలో, విద్యలో, రాజకీయాల్లో మతం జోక్యం ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగంలో సెక్యులరిజం అనే పదం లేకుంటే దేశం ఒక్కటిగా ఉండేదా? అని అడిగారు.

జాతీయోద్యమంలో కమ్యూనిస్టులది కీలక పాత్ర : పోటు రంగారావు

కార్మికులను, రైతులను ఒక్కటి చేసి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేయడంలో కమ్యూనిస్టులది కీలక పాత్ర అని సిపిఐ(ఎంఎల్)-ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు చెప్పారు. జాతీయోద్యమంతో సంబంధం లేనివారు నేడు దేశభక్తి గురించి గొప్పగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో ఫాసిస్టు ధోరణులు బుసలు కొడుతున్న తరుణంలో ఏచూరి లాంటి నేత మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. కులం, మతం, ప్రాంతం పేర మనుషుల మధ్య విభజనలు సృష్టించి విద్వేషాల మీద మోడీ సర్కారు నడుస్తున్నదని విమర్శించారు.

దేశంలో విభజన రాజకీయాలు : చలపతిరావు

దేశంలో రైతు, కార్మిక ఉద్యమాలపై తీవ్ర నిర్బంధం కొనసాగుతుండటం పట్ల సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలపతిరావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు ఖనిజవనరులను దోచిపెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలను మోడీ సర్కారు చంపిస్తున్నదని ఆరోపించారు.

కమ్యూనిస్టులు ఏకం కావాలి : ఉపేందర్‌రెడ్డి

దేశంలో కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఎంసిపిఐ పొలిట్ బ్యూరో సభ్యులు ఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత చూరగొనాలనీ, పార్లమెంట్‌లోపలా, వెలుపలా పోరాటాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు.

ఓట్ల దొంగతనంతో గెలిచే పనిలో మోడీ
సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా

ఓట్ల దొంగతనంతో తన అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకునే పనిలో బిజెపి ఉందని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా విమర్శించారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. భావజాలరంగంలో ప్రత్యామ్నాయ సంస్కృతిని తీసుకుని ముందుకు పోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు.

దేశంలో అధ్యక్షతరహా పాలన తెచ్చే కుట్ర : జానకిరాములు

దేశంలో అధ్యక్ష తరహా పాలన తెచ్చే కుట్ర జరుగుతున్నదని ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు విమర్శించారు. సిబిఐ, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలను మోడీ సర్కారు తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నదని ఆరోపించారు. బిజెపి ప్రధాన శత్రువు కమ్యూనిస్టులేనని విమర్శించారు. ఇలాంటి తరుణంలో కమ్యూనిస్టులంతా ఐక్యమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి : మురహరి

ప్రమాదంలో పడ్డ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు మురహరి నొక్కి చెప్పారు. ఇండియా అనేక జాతుల సమూహమనీ, ఇక్కడ ఒకేజాతి, ఒకే ఎన్నిక, ఒకే భాష అంటే నడవదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, టి.సాగర్, ఎండి అబ్బాస్, బండారు రవికుమార్, సిపిఎం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సూర్యం, పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల 2 నెలల పెండింగ్ బకాయిలు విడుదల

- గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులను విస్మరించింది
- మంత్రి అడ్లూరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసినట్టు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్, ఉద్యోగుల సంక్షేమంకోసం తమ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖలో జూలై, ఆగస్టు వేతనాలు పెండింగ్‌లో ఉన్న రూ.11.53 కోట్లు బకాయిలను విడుదల చేయటమే ఇందుకు సాక్షమన్నారు. టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీకి చెందిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ సిబ్బందికి, సబ్జెక్ట్ అసోసియేట్స్, హెడ్‌ఆఫీస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి, స్వీపింగ్, శానిటేషన్, కేటరింగ్ సేవలకు సంబంధించి రెమ్యునరేషన్, సర్వీస్ ఛార్జీలు విడుదల చేశామని తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు సబ్జెక్ట్ అసోసియేట్స్, సీనియర్ ఫ్యాకల్టీ, గేమ్స్ కోచ్‌లు మొదలైన వారికి రూ.2.38 కోట్లు విడుదల చేశామన్నారు. 18 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం ప్రారంభమైందని చెప్పారు. ప్రగతి భవన్, కలెక్టరేట్ల నిర్మాణానికి నిధులు వెచ్చించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల నిర్మాణాలకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. విద్యార్థుల విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో ఎన్నడూ సంక్షేమ హాస్టళ్లలో భోజనం చేయలేదని చెప్పారు. స్కాలర్‌షిప్‌ల్లో కేంద్రం వాటా పెంచాలని కోరామని చెప్పారు. పోటీపరీక్షలకోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో సిఎస్ఆర్ నిధులతో నూతన హాస్టల్‌ను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.గ్రూప్ వన్ విషయంలో బట్ట కాల్చి మీదేయడం కాదు....ఆధారాలుంటే నిరూపించాలని బిఆర్‌ఎస్ నేతలకు సవాల్ చేశారు. పిల్లల భవిష్యత్తు విషయంలో తప్పు చేయబోమని స్పష్టం చేశారు. షేక్ పేట, ధర్మపురిలో రూ.24 లక్షలతో మోడ్రన్ కిచెన్లను పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడరా?

- రాహుల్ గాంధీని తప్పుపట్టిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొనసాగుతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలను అవలంభిస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో "ఓటు చోరీ" గురించి నీతులు చెబుతున్న రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న "ఎమ్మెల్యేల చోరీ" గురించి మాట్లాడకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలో జరుగుతున్న ఎమ్మెల్యే చోరీపై రాహుల్ గాంధీ సిగ్గుపడాలని పేర్కొన్నారు. "ఇది రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో లేవనెత్తుతున్న ఓటు చోరీ కంటే దారుణమైన నేరం" అని అని అభిప్రాయపడ్డారు. ఇలాంటి అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ప్రక్రియలో భాగస్వామి అయినందుకు రాహుల్ గాంధీకి సిగ్గుందా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ టికెట్లపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు, ఇప్పుడు తాము పార్టీ మారలేదంటూ చేస్తున్న వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఇంత బహిరంగంగా, సిగ్గు లేకుండా జరుగుతున్న ఫిరాయింపు రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యాన్ని చూసి రాహుల్ గాంధీ సిగ్గుపడాలని విమర్శించారు. పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిసి, వారితో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు "మేము కాంగ్రెస్‌లో చేరలేదు" అని చెప్పడాన్ని కేటీఆర్ తీవ్రంగా ప్రశ్నించారు.

బిసి వ్యతిరేకి బిజెపి

- జనాభాకు తగ్గట్టు రాజకీయ ప్రాతినిధ్యం దక్కనీయట్లే
- రిజర్వేషన్‌లు కల్పిస్తలే.. ఇస్తే అడ్డుకుంటుంది
- బహిరంగ సభలో కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తాం
- పశుసంవర్ధక, ఫిషరీష్ శాఖ మంత్రి వాకటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



'రాష్ట్రంలో ఎవరి జనాభా ఎంత ఉందో వారికి అంత ప్రాతినిధ్యం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంటే.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుంది. బిసిల సంక్షేమానికి మేము తాపత్రయపడుతుంటే అందుకు విరుద్ధంగా బిసిలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. జనాభాకు అనుగుణంగా బిసిలకు రిజర్వేషన్లు కేంద్రం అమలు చేయట్లేదు. చేస్తే అడ్డుకుంటుంది' అని పశుసంవర్ధక, ఫిషరీష్, క్రీడా యువజన శాఖ మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిసి డిక్లరేషన్ కృతజ్ఞత సభ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాలకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రూరల్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేసిన దేశ వ్యాప్తంగా పాదయాత్ర సమయంలో పార్లమెంట్, అసెంబ్లీ గడపదొక్కని వెనుకబడ్డ జాతులు ఉన్నట్టు గుర్తించారని, అందుకే 'దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో చట్టసభల్లో వారికి అంతే భాగస్వామ్యం' కల్పించాలనే సంకల్పం తీసుకున్నారని తెలిపారు. ఆయన సూచిన మేరకే సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కుల గణనను శాస్త్రీయబద్ధంగా చేపట్టి లెక్క తేల్చారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ద్వారా బిసిలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనాడు తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు కోసం జయలలిత కోరగా.. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆమోదించినట్టు గుర్తుచేశారు. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని అన్నారు. చట్టబద్ధంగానే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ ద్వారా ఆర్డినెన్స్ రూపొందించామని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ల పరిమితి ఎత్తివేశామని తెలిపారు. రిజర్వేషన్లు అమలు చేసుకునేందుకు ఆయా రాష్ట్రాలకే అధికారం ఇవ్వాలని సూచించారు. కులగణన చేపట్టిన వివరాలు ఎక్కడా దాచిపెట్టలేదని.. పబ్లిక్ డోమైన్‌లో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో ఎంత మంది చదువుకున్నారు..? ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు? ఇలా ప్రతి ఒక్కరి వివరాలు రూపొందించి అందుబాటులో పెట్టినట్టు చెప్పారు. యూరియా సరిపడా పంపడంలో కేంద్రం తాత్సారం చేస్తుందని ఫలితంగా రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. అయినా స్థానిక బిజెపి ప్రజాప్రతినిధులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టేలా పరిపాలించిందని.. కానీ ప్రజా ప్రభుత్వం అందరినీ సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తుందని ముదిరాజ్, బెస్త కులస్తుల విషయమై ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, పాడిపరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు మానాలమోహన్‌రెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం కోల్పోతున్న విభాగాలను గుర్తించండి

- వాణిజ్య పన్నుల శాఖ సమీక్షలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాణిజ్య పన్నులశాఖకు సంబంధించి ఆదాయం కోల్పోతున్న విభాగాలు, ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుతోపాటు వ్యాపార లావాదేవీలను హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఇదే అంశంపై శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి ప్రతీ పదిహేను రోజులకొకసారి వాణిజ్య పన్నులశాఖ పనితీరు, పన్నుల పురోగతిపై తాను సమీక్ష నిర్వహిస్తానని ఆయన చెప్పారు. జిఎస్‌టి రేట్ల రేషనలైజేషన్ వల్ల రాష్ట్రం ఎంత ఆదాయం కోల్పోతోందనే అంశంపై క్షుణ్ణంగా అధ్యయనం నిర్వహించి, ఒక నివేదికను సమర్పించాలంటూ సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు వీలుగా యావత్ యంత్రాంగం కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. జిఎస్‌టి ఎగవేతదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిప్యూటీ సిఎం ఈ సందర్భంగా ఆదేశించారు. నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

16 నుంచి ఎంబిబిఎస్, బిడిఎస్ కౌన్సిలింగ్

రాష్ట్రంలో ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల కోసం ఈ నెల 16 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం షెడ్యూలు ఖరారు చేసింది. 15న జనరల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. మొదటి విడత కౌన్సిలింగ్ 16 నుంచి ప్రారంభం కానుంది. వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు 17 నుంచి 19వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. 20 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో భాగంగా వెబ్ ఆప్షన్లు 26 నుంచి 28వ తేదీ వరకు ఇచ్చుకోవచ్చు. 29న రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

కేన్సర్‌కు అధునాతన చికిత్స

- ఆర్టికాన్-2025 సదస్సు విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేన్సర్ చికిత్సలో వస్తున్న ఆధునాతన పద్ధతులను తెలుసుకునేందుకు ఆర్టికాన్ -2025 విజయవంతంగా ఉపయోగపడుతున్నదని నిర్వాహకులు తెలిపారు. భారత రేడియేషన్ థెరపిస్టులు మరియు టెక్నాలజిస్టుల సంఘం (ఏఆర్టీటీఐ) వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ అప్పర్తి శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో "ఆర్టికాన్-2025" వార్షిక సదస్సు కొనసాగుతున్నది. ఈ నెల 14న సదస్సు ముగియనున్నది. ఎఆర్‌టిటిఐ నిర్వహిస్తున్న 29వ జాతీయ సదస్సు ఇది. సదస్సుకు పట్ల నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, సింధు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎం.బాబయ్య శుక్రవారం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ ఏడాది సదస్సుకు హర్నెస్సింగ్ ఎక్సలెన్స్ ఇన్ రేడియేషన్ థెరపీ-ఎన్ ఆర్టీటీ పర్స్పెక్టివ్ అనే ప్రధాన అంశాన్ని ఎంపిక చేశారు. రేడియేషన్ థెరపీ, ఆంకాలజీ రంగాల్లో జ్ఞాన పంచకం, సాంకేతిక ఆవిష్కరణలు, దేశ-విదేశాల నిపుణుల మధ్య సహకారం కోసం వేదిక చర్చిస్తున్నది. సదస్సులో దేశవ్యాప్తంగా 500 మందికి పైగా ప్రతినిధులతో పాటు పదుల సంఖ్యలో అంతర్జాతీయ అతిథులు హాజరయ్యారు. ఇందులో ప్రముఖ ఆస్పత్రుల వైద్య సంచాలకులు, ప్రఖ్యాత ఆంకాలజిస్టులు, మెడికల్ ఫిజిసిస్టులు, రేడియేషన్ థెరపీ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు ఉన్నారు. రేడియేషన్ ఆంకాలజీ, థెరపీ తాజా అభివృద్ధిపై శాస్త్రీయంగా చర్చలు జరిగాయి.

15 నుంచి ఇంజనీరింగ్ కాలేజీల నిరవధిక బంద్

- అదే దారిలో వృత్తివిద్యా కళాశాలలు
- 16 నుంచి డిగ్రీ, పిజి కాలేజీల బంద్
- ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి
- టోకెన్లు ఇచ్చిన రూ.1200 కోట్లు నెలా ఖరులోగా చెల్లించాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేత
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


బాలకిష్టారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.పది వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్‌ఎటిహెచ్‌ఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫీజు బకాయిలతో కాలేజీలను నడపలేమనీ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, అద్దెలు కట్టలేని పరిస్థితి ఉందని ప్రకటించింది. అందుకే ఈనెల 15 నుంచి ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యా కాలేజీలు నిరవధిక బంద్ చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డిని ఎఫ్‌ఎటిహెచ్‌ఐ చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు, సెక్రటరీ జనరల్ రవికుమార్, కోశాధికారి కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె సునీల్‌కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో రమేష్‌బాబు, రవికుమార్ మాట్లాడుతూ... ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను ఈనెలఖరులోగా చెల్లించాలని కోరారు. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఫీజు బకాయిలున్నాయని చెప్పారు. ఫీజుబకాయిలు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులు ప్రయివేటు, డీమ్డ్ విశ్వవిద్యాల యాలకు వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఉన్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికీ జీతాలివ్వలేని పరిస్థితి ఉందన్నారు. దసరా పండుగ వస్తున్నదనీ, అప్పుడు కూడా జీతాలివ్వకపోతే ఎలా?అని ప్రశ్నించారు. జీతాలివ్వకుంటే కాలేజీలకు రాబోమంటూ అధ్యాపకులు,బోధనేతరసిబ్బందియాజమాన్యాలకు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రయివేటు ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొన్ని కాలేజీలు అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నాయని వివరించారు. ఇంకోవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నామని అన్నారు. అందుకే మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 15 నుంచి రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, ఆర్కిటెక్చర్, ఎంబిఎ, ఎంసిఎ, లా, బిఇడి, పారామెడికల్ కాలేజీలు నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో పది లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎటిహెచ్‌ఐ అల్జాపూర్ శ్రీనివాస్, తుమ్మ జైపాల్‌రెడ్డి, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి, రేపాక ప్రదీప్‌రెడ్డి, గుర్రం నాగయ్య, కె రామదాస్, ముద్దసాని రమేష్‌రెడ్డి, పుల్లా రమేష్‌బాబు, గోపగాని వెంకట నారాయణ, శ్రీనివాస్ ఆచార్య తాడూరి, సరస్వతీ రమేష్, కోదాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు బంద్ : సూర్యనారాయణరెడ్డి

అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక, అద్దెలు కట్టలేక ఈనెల 16 నుంచి రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించామని టిపిడిఎంఎ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి చెప్పారు. ఫీజు బకాయిలను ఈ ఏడాది మే 20లోపు విడుదల చేయిస్తామంటూ ఉన్నత విద్యామండలి చైర్మన్ హామీ ఇవ్వడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో తాము డిగ్రీ విద్యార్థుల పరీక్షలను నిర్వహించామని గుర్తు చేశారు. డిగ్రీ, పీజీ కాలేజీలకు రూ.2,500కోట్ల వరకు ఫీజు బకాయిలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రయివేటు కాలేజీలను ప్రభుత్వం తీసుకుని నడపాలని కోరారు. తాము కాలేజీలను నడపలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పారు. టిపిడిఎంఎ ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యావైద్య రంగాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. 20 నెలలైనా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం : బాలకిష్టారెడ్డి

ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈనెల 15 నుంచి ఇంజినీరింగ్ సహా వృత్తి కాలేజీలు, 16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీల నిరవధిక బంద్ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి చెప్పారు. తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ అంశాన్ని వివరిస్తామని సమస్య పరిష్కారం కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

రాష్ట్రానికి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి కేంద్రం నుంచి శుక్రవారం 11,930 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రెండు రోజుల క్రితం 23000 మెట్రిక్ టన్నులు సరఫరా అయిందని తెలిపారు. మరో నాలుగు రోజుల్లో రాష్ట్రానికి 27,650 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో యూరియా సరఫరాలపై వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపితో మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలోని ఆర్‌ఇసిఎల్ ఎరువుల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా మరోసారి కేంద్రాన్ని కోరాలంటూ అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి తెలిపారు.

ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రి భేటీ

రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి కోసం ఇక్రిశాట్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. చిక్కుళ్ళు, తృణధాన్యాల్లో మెరుగైన రకాలతోపాటు, వివిధ పంటలలో తాము అమలు చేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను ఇక్రిశాట్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వ్యవసాయ రంగంలో ఇక్రిశాట్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

మంత్రి తుమ్మలతో ఆఫ్రికన్ ప్రతినిధుల భేటీ

వ్యవసాయ, విత్తనోత్పత్తి రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిని స్వయంగా తెలుసుకునేందుకు ఆఫ్రికన్ ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతుల సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను, విత్తనోత్పత్తి రంగంలో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల భాగస్వామ్యంతో సాధించిన విజయాలను మంత్రి వారికి వివరించారు. విత్తన రంగంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని పెంపొందించుకుంటామని తెలిపారు.

గోదావరి తీరప్రాంతాల్లో 'పుష్కర' ఏర్పాట్లు చేయండి

- ఏకకాలంలో రెండు లక్షల మంది స్నానాలు చేసేలా ఘాట్ల నిర్మాణాలు
- శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు
- ఆలయాలనూ తీర్చిదిద్దండి
- గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సిఎం సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి తీరప్రాంతాల్లో పుష్కరాల ఏర్పాట్లను శాశ్వత ప్రాతిపదికగా చేపట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఏకకాలంలో రెండులక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. 2027 జులై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయనీ, ఇప్పటి నుంచి 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నాహకాలపై శుక్రవారంనాడిక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవిందహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్కరాల ప్రణాళికల్ని అధికారులు సిఎంకు వివరించారు.

మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీర ప్రాంతముందని తెలిపారు. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసందర్భంగా సిఎం మాట్లాడుతూ గోదావరి తీరం వెంట ఏకకాలంలో రెండు లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించేలా ఘాట్ల నిర్మాణాలు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ధర్మపురి, కాళేశ్వరం వంటి ప్రధాన ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. యాత్రికుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలనీ, పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. యాత్రీకులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగడానికి వీల్లేదని, రోడ్ల నిర్మాణం మొదలు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలనీ, వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లు, వసతి సౌకర్యాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఆలయ కమిటీలు, అధికారులతో చర్చించాలనీ, మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవం ఉన్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని చెప్పారు. గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలనూ సందర్శించి వేర్వేరుగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసుకోవాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్ సహా అందుబాటులో ఉన్న అన్ని కేంద్ర పథకాలనూ సమన్వయం చేసుకుంటూ, నిధుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్
- హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల జెఎసి (టియుజెఎసి) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. జెఎసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో కోదండరాం మాట్లాడుతూ.. ప్రజాస్వామిక తెలంగాణ సాధనలో భాగంగానే ఉద్యమకారులకు రావలసిన హక్కులను సాధించుకునే దిశగా ఉద్యమకారులు మరో ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఉద్యమకారులు రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. ఎన్నో త్యాగాల పునాదుల మీద స్వరాష్ట్రం సిద్ధించిందని, ఏర్పడిన తెలంగాణలో ప్రజలకు ప్రజాస్వామ్య హక్కులు దక్కాలని తెలిపారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగాలని, ఉద్యమకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. 250 గజాల స్థలం ఇచ్చి వారికి అక్కడే ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, గద్దర్ కుమారుడు సూర్యం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, ఓయూ జేఏసీ నాయకులు మాందాల భాస్కర్, టివియువి అధ్యక్షులు కంచర్ల భద్రి, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుండా యాదగిరి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల వీరోచిత పాత్ర

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులతోపాటు మహిళలూ ప్రముఖ పాత్ర వహించారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ భవనంలో తంగెళ్ల వెంకటచంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా జిల్లా వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటాలో స్త్రీలు పురుషులతో సమానంగా పోరాటాలు చేశారని తెలిపారు. కులమతాలకతీతంగా, అణచివేతకతీతంగా, దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో మహిళలు ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వారి పాత్ర అమోఘం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్.. చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లింల వివాదంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పోరాటాలపై తప్పుడు వక్రీకరణలు చేస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు మేకన బోయిన సైదమ్మ, జూలకంటి విజయలక్ష్మి, జిల్లా ఆఫీస్ బేరర్స్ సురభి లక్ష్మి, షేక్ ఖాజాబీ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

విద్యుత్ బస్సుల విధానంలో మార్పు తేవాలి

- బత్తుల సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాతావరణ కాలుష్య రహిత ఉద్దేశంతో తీసుకొచ్చిన విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్‌టిసినే నిర్వహించే విధంగా నిధులు కేటాయించి నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని టిజిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు బస్సులను కార్పొరేట్లకు అప్పగించడం వల్ల సబ్సిడీ ప్రయివేటు వ్యక్తులకే చెంది లాభం చేకూరుతుందని అన్నారు. ఆర్టీసీ నిర్వహణలో మాత్రం సంస్థకు తీవ్రమైన నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని, దీనివల్ల సంస్థ తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ప్రస్తుతం 575 విద్యుత్ బస్సులు రాష్ట్రంలో నడుస్తున్నాయని, దీనివల్ల డ్రైవర్లు మెకానిక్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీలే నిర్వహించి నిర్వహణ మొత్తం సంస్థ నిర్వహించే విధంగా మార్పులు తేవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి కార్మికులకు పెరుగుతున్న భారాలను అరికట్టాలన్నారు. ఆర్టీసీ రక్షణ -కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, 2021 వేతన సవరణ వెంటనే చేయాలని అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు డి.రవి, వి.లక్ష్మయ్య, నాయకులు రాజయ్య, నాగమల్లు, రమేష్, పిచ్చయ్య, వెంకన్న, యాకమ్మ, సంధ్య, సైదమ్మ, రాజేశ్వరి, ధనలక్ష్మి, స్వరూప, లక్ష్మి, ఉపేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

17న ఖమ్మానికి ఎంఎ బేబీ

- 'తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల' ముగింపు సభకు హాజరు
- చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి ముస్లిం - హిందూ పోరాటంగా చిత్రీకరణ : నున్నా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ హాజరుకానున్నట్టు ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈ సభకు బేబీతో పాటు కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, రెడ్‌షర్ట్ వాలంటీర్లు హాజరై విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తూ ముస్లిం- హిందూ పోరాటంగా చిత్రీకరిస్తోందని చెప్పారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, వై విక్రమ్‌తో కలిసి నున్నా మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ చిట్యాల ఐలమ్మ వర్ధంతి రోజున ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నైజాం ప్రభుత్వం కూలిపోయి భారతదేశంలో విలీనమైన 17వ తేదీతో ముగుస్తాయన్నారు.



హిందూ ముస్లిం పోరాటం కాదు.. వర్గ పోరాటం

ఫ్యూడలిజం, రాచరిక వ్యవస్థ, భూస్వామ్య దోపిడీపై తిరుగుబాటు చేసిన వర్గ పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని నున్నా తెలిపారు. ఈ పోరాటంలో హిందువులే కాదు.. ముస్లింలు సైతం పాల్గొన్నారని, ముగ్దుం మొహినొద్దీన్, షోయబుల్లాఖాన్, బందగీ వంటి అనేక మంది ఈ పోరాటంలో అసువులు బాసారని తెలిపారు. ఈ చారిత్రక పోరాటం జరిగి సుమారు 77 సంవత్సరాలైందని, ఎప్పుడూ లేని విధంగా బీజేపీ దీనిపై సభలు నిర్వహిస్తూ చరిత్రను వక్రీరిస్తూ మతం రంగు పులమడం అత్యంత దుర్మార్గమన్నారు. హిందూ-ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ 'రజాకర్ల ఫైల్స్' వంటి చిత్రాలను రూపొందించి తప్పుడు సంకేతాలు ఇస్తోందన్నారు. దీన్ని సిపిఎం, వామపక్షాలు ఖండిస్తున్నాయన్నారు. నిజాం పాలనలోనూ హిందూ-ముస్లింలు కలిసి మెలిసి ఉన్నారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జమీందారీ, జాగీర్దారీ, దేశ్‌ముఖ్‌ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి, వెట్టిచాకిరీ రద్దు చేయాలని, పన్నులు వేసి ప్రజలను పీడించే విధానం పోయి ప్రజాస్వామ్యం కావాలని కోరుతూ జరిగిన పోరాటమని తెలిపారు. చిట్యాల ఐలమ్మ పోరాటం.. దొడ్డి కొమరయ్య అమరత్వం తర్వాత సాయుధ పోరాట రూపం తీసుకుందని, దీనికి పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, అరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి అనేక మంది యోధులు ఈ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, నాలుగువేల గ్రామాల్లో వెట్టిచాకిరీ రద్దయిందని తెలిపారు. జమీందారు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టి ప్రజాపాలన వచ్చిందన్నారు. ఈ పోరాట ఫలితంగానే భారతదేశంలో తెలంగాణ ప్రాంతం విలీనమైందని తెలిపారు. కొందరు దీన్ని వక్రీకరించి పటేల్ సైన్యాలు రావటంతోనే నైజాం ప్రభువును లొంగదీసుకున్నట్టుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. లక్షల మంది జైళ్ల పాలయ్యారని, అనేక హత్యలు, లైంగికదాడులు, సామూహిక హత్యాకాండలు జరిగాయని వివరించారు. ఈ పోరాటంలో ఏ ఒక్కచోట బిజెపి కార్యకర్త ప్రమేయం లేదని స్పష్టంచేశారు. బిజెపి చేస్తున్న ఈ విష ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే ఈ సభ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దేశంలో భూసంస్కరణలు, కౌలుదారీ వంటి అనేక చట్టాలు వచ్చాయంటే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే కారణమన్నారు. అంతటి మహత్తర పోరాటాన్ని బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్.. తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తుండడాన్ని ఖండించారు. 17న నిర్వహించే సభ ద్వారా ఈ విషయాలన్నింటినీ మరోసారి ప్రజలముందుంచుతామని తెలిపారు.

ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో స్పెషల్ టీచర్లను నియమించాలి

- డైరెక్టర్, కార్పొరేషన్ చైర్మన్‌లకు ఎన్‌పిఆర్‌డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో స్పెషల్ టీచర్లను నియమించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు ఎన్‌పిఆర్‌డి అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర నాయకులు పి శశికళ వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. కోవిడ్ అనంతరం పిల్లల మానసిక స్థితిలో అనేక మార్పులు వస్తున్నాయని, అటిజం, మేధోపరమైన వైకల్యం, సెరిబ్రాల్ పాల్సి, వినికిడి లోపం, అభ్యాసంలో లోపాలు, ప్రవర్తనలో మార్పులు, భావోద్వేగాలపై లోపాలు, ఇంద్రియ లోపాలు వంటి అనేక రకాల వైకల్యాలతో వారు తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను అర్థం చేసుకునేందుకు వీలుగా పిల్లల వైద్యులు, డెవలప్‌మెంట్ పీడియాట్రీషియన్స్, స్పీచ్, లాంగ్వేజీ, అక్యూఫేషనల్, బిహేవియర్ థెరపిస్టులు, కౌన్సిలర్లను నియమించాలని డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టంలోని సెక్షన్ 16 ప్రకారం ప్రభుత్వ అనుమతి పొందిన విద్యాసంస్థల్లో వైకల్యం కలిగిన విద్యార్థులకు విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైకల్యం కలిగిన విద్యార్థుల పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా సకలాంగులైన విద్యార్థులతో సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

చర్యలు తీసుకుంటాం:డైరెక్టర్, చైర్మన్ హామీ

ప్రయివేట్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో స్పెషల్ టీచర్లను నియమించెందుకు విద్యా శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ బి శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య హామీ ఇచ్చారు.

పేదల భూములు లాక్కుంటున్న కేంద్రం

- అదాని, అంబానిలకు ఊడిగం చూస్తోంది : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మారుమూల ప్రాంతాల్లోని గ్రామీణ, దళిత బిడ్డల భూములను వివిధ రకాల పేర్లతో లాక్కొని, పెట్టుబడిదారులకు, అదానీ అంబానీలకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. నిమ్జ్ భూ బాధితుల సమస్యల పరిష్కారానికి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక విజ్ఞాన కేంద్రం నుంచి నిమ్జ్, ఆర్డీవో కార్యాలయాల వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రకాల పేర్లతో నిరుపేదల నుంచి భూములను లాక్కొని పెట్టుబడిదారులకు కారు చౌకగా అందజేస్తూ భూ దందాలు కొనసాగిస్తుందన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో భూ నిర్వాసితులకు లాభం చేకూరే విధంగా తీసుకొచ్చిన 2013 భూ చట్టానికి తూట్లు పొడుస్తూ రాష్ట్రాల్లో నిరుపేదల నుంచి భూములు తీసుకునేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలను కల్పిస్తూ సవరణలు తీసుకువచ్చిందన్నారు. ఆ సవరణలతోనే మాజీ సీఎం కేసీఆర్ 123 జీవోను తీసుకొచ్చి భూ బాధితులకు నష్టపరిహారం రాకుండా చట్టంలో అనేక మార్పులు చేశారని తెలిపారు. దేశంలోని బీజేపీ పాలిత అన్ని రాష్ట్రాల్లో నిర్ధాక్షిణ్యంగా నిరుపేదల నుంచి భూములను లాక్కునే పరంపర కొనసాగుతుందన్నారు. బీజేపీ విధానాలతో దేశవ్యాప్తంగా భూములన్నీ కేవలం ఒకే వర్గం చేతిలోకి వెళ్లిపోవడంతో ఆహార అభద్రతతో పాటు ఆర్థిక అసమానతలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం ఊబిలో పడకుండా యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 2013 చట్టాన్ని అమలు చేసి, అవసరం మేరకు మాత్రమే భూములను కొనుగోలు చేయాలని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన నిమ్జ్ కోసం వేల ఎకరాల భూమిని సంవత్సరాల తరబడి స్వాధీనపరచుకుంటున్నారే తప్ప అందులో ఇప్పటికి ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. చట్ట ప్రకారం భూములు తీసుకున్న అన్ని వర్గాల వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అవి సాధించేంతవరకు దేశవ్యాప్తంగా తమ ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాం, సంఘం జిల్లా అధ్యక్షులు బి. రామచందర్, ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింలు, సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్, వ్యకాస జహీరాబాద్ మండల అధ్యక్షులు ఎస్. సుకుమార్ పాల్గొన్నారు.

వర్షంతో.. హయత్‌నగర్‌లో ఒరిగిన భవనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్‌లో గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా పలు కాలనీలు జలమయమయ్యాయి. హయత్‌నగర్ పద్మ కాలనీలోని ఓ ఇంటి పునాది కొట్టుకుపోవడంతో భవనం పక్కకు ఒరిగి ప్రమాదకర స్థితిలోకి చేరింది. వర్షం కారణంగా ఆ ఇంటి పునాది బలహీనపడటంతో భవనం మెల్లగా పక్కకు ఒరగడం ప్రారంభించింది. ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఒరిగిన భవనానికి ఆనుకొని 11 కెవి హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉండటంతో ప్రమాదం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

యూరియా కష్టాలను చూపిస్తే రిపోర్టర్‌పై కేసులా?

- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లాలో రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన టివి రిపోర్టర్‌పై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. జర్నలిస్టుపై కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన రెండు నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోకుండా వాస్తవాలను ఎత్తి చూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. శాంతిభద్రతల పేరుతో ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. జర్నలిస్టు సాంబశివరావుపై పెట్టిన కేసులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.


యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా స్ట్రక్చర్ సమావేశం బహిష్కారం

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల సమస్యల పట్ల సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి. సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో కార్మిక నాయకులు మిరియాల రంగయ్య, కె. సారయ్య, వైవీ రావు, వీరభద్రయ్య, సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వంగ వెంకటి, ఎం.రమేష్‌తో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. సింగరేణి సీఎండీతో యూనియన్ చేసిన ఒప్పందాలను అమలు చేయడం లేదని చెప్పారు. వాటిని కనీసం సర్క్యులర్ రూపంలో ఇవ్వకుండా యాజమాన్యం కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. సొంతింటి పథకంపై కమిటీ వేసినప్పటికీ ఒకసారి కూడా సమావేశాన్ని నిర్వహించలేదని గుర్తు చేశారు. పదేండ్లుగా కొనసాగిన మెడికల్ బోర్డు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. వెంటనే మెడికల్ బోర్డును కొనసాగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో 35 శాతం వాటా కార్మికులకు ప్రకటించాలని కోరారు. ఆదాయ పన్ను విషయంలో కోల్ ఇండియా అమలు చేస్తున్న విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని బదిలీ విధానాన్ని తీసుకొచ్చి సింగరేణి కార్మికులను ఇబ్బంది పెడుతున్నదని విమర్శించారు. డిస్మిస్ కార్మికులకు మరొకసారి అవకాశం కల్పించాలనే తమ విజ్ఞప్తిని యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. అన్ని క్యాడర్ స్కీమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వర్కర్స్‌కు హై పవర్ వేతనాలను ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆశీర్వాద్ మసాలకు హీరో నాని ప్రచారం



హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ ఐటిసి తన ఆశీర్వాద్ మసాలకు నటుడు నానితో కొత్త ప్రచారం కల్పిస్తోన్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లోని గృహిణులను లక్ష్యంగా చేసుకుని ఈ క్యాంపెయిన్ కొనసాగనుందని ఐటిసి ప్రతినిధి పియూష్ మిశ్రా పేర్కొన్నారు.

చౌక ధరలో జియోసావ్న్ ప్రీమియం ఆడియో

హైదరాబాద్ : ఆడియో స్ట్రీమింగ్ సర్వీస్ అయిన జియోసావ్న్ చౌక ధరలో ప్రీమియం ఆడియోను అందిస్తున్నట్లు తెలిపింది. రెగ్యూలర్ ప్లాన్ నెలకు రూ.89గా ఉన్నప్పటికీ.. వినియోగదారులు మొదటి రెండు నెలలు రూ.9కే ప్రీమియం కంటెంట్‌ను పొందవచ్చని పేర్కొంది. అదే విధంగా జియో 9వ వార్షికోత్సవ ఆఫర్‌లో రూ.349 రీఛార్జ్‌తో 1 నెల ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించింది.

18 నుంచి ఫార్మా ప్రో ఎక్స్‌పో

హైదరాబాద్ : సెప్టెంబర్ 18 నుంచి 20వ తేది వరకు నగరంలోని హైటెక్స్‌లో అనలిటికా ల్యాబ్ ఇండియా, ఫార్మా ప్రో, ప్యాక్ ఎక్స్‌పో 2025 జరగనుంది. 50,000 చదరపు మీటర్ల స్థలంలో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్రదర్శనకు 650 పైగా ఎగ్జిబీటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి ఫార్మాస్యూటికల్ తయారీ సంస్థలు, భాగస్వాములు, పరిశోధన ఆవిష్కర్తలు హాజరు కానున్నారని వెల్లడించారు.

విన్‌ఫాస్ట్ ఇండియా విఎఫ్6, విఎఫ్7 ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాలు

- హైదరాబాద్‌లో మొదటి ఎలక్ట్రిక్ షోరూమ్‌లు ప్రారంభం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విన్‌ఫాస్ట్ ఇండియా మొదటి ఎలక్ట్రిక్ షోరూమ్‌లను నానేష్ ఆటోమోటివ్స్ ప్రయివేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ప్రారంభించారు. ప్రీమియమ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు విఎఫ్ 6, విఎఫ్ 7ను పరిచయం చేసింది. ఈ సందర్భంగా గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విన్‌ఫాస్ట్ ఇండియా డిప్యూటీ సిఇఒ అరుణోదయ్ దాస్ మాట్లాడారు. ప్రపంచ ప్రసిద్ధ డిజైన్ స్టూడియోలైన పినిన్‌ఫరినా, టొరినో డిజైన్ రూపొందించిన ప్రీమియమ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువిలు విఎఫ్ 6, విఎఫ్ 7ను పరిచయం చేశామన్నారు. వీటిని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 468 నుంచి 520 కిలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ వస్తాయన్నారు. పదేళ్ల బ్యాటరీ వారంటీ కలదన్నారు. పానోరమిక్ సన్‌రూఫ్, లెవల్-2 అడాస్, 360 కెమెరా, ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ, లగ్జరీ ఇంటీరియర్లు వంటి ప్రీమియం ఫీచర్లు అసాధారణ డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తాయన్నారు. అదనంగా విఎఫ్ 7 మోడల్ ఎఫ్‌డబ్ల్యుడి, ఎడబ్ల్యుడి వేరియంట్లలో లభిస్తున్నాయని తెలిపారు. అధిక సామర్థ్యం, శక్తివంతమైన పని తీరు కోసం ఎంచుకునే సౌలభ్యం ఉందన్నారు. విఎఫ్ 6 ఎక్స్-షోరూమ్ ధర రూ.16.49 లక్షల నుంచి, విఎఫ్ 7 ఎక్స్-షోరూమ్ ధర రూ.20.89 లక్షల నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. భారత మార్కెట్‌లో మరింతగా బలపడేందుకు దేశవ్యాప్తంగా ఛార్జింగ్, ఆఫ్టర్-సేల్స్ సేవల కోసం రోడ్‌గ్రిడ్, మైటీవీఎస్, గ్లోబల్ అష్యూర్ వంటి సంస్థలతో స్ట్రాటజిక్ భాగస్వామ్యాలను ఏర్పరచుకున్నామని తెలిపారు. బ్యాటరీ రీసైక్లింగ్, సర్క్యులర్ వాల్యూ చైన్ అభివృద్ధి ద్వారా పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు కట్టుబడి ఉన్నట్టు బ్యాట్‌ఎక్స్ ఎనర్జీస్‌తో భాగస్వామ్యం చేసుకున్నామన్నారు. 2025 చివరి నాటికి 27 నగరాల్లో 35 డీలర్‌షిప్‌లు, 26 వర్క్‌షాప్‌లతో విస్తరించనున్నామని తెలిపారు. తద్వారా కస్టమర్లకు చాలా సులభంగా సేవలు అందించనున్నామని చెప్పారు. తమిళనాడులోని తూత్తుకుడిలో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న కొత్త తయారీ కేంద్రం ప్రారంభంలో ఏటా 50,000 వాహనాల సామర్థ్యంతో భారత్‌లో ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యాటరీ ఉత్పత్తితో పాటు ఇఒ అభివృద్ధిలో తన దీర్ఘకాల పెట్టుబడిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. భారత ఇవి మార్కెట్ ఒక ఉత్తేజకరమైన మలుపులో ఉందన్నారు. ఎక్కువ మోడల్స్ మార్కెట్‌లోకి వస్తున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నందున ప్రస్తుతం 2.5 నుంచి నాలుగు శాతం మధ్య ఉన్న నాలుగు చక్రాల ఈవీల వినియోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పర్యావరణ అనుకూల పరిష్కారాలతో ఈ మార్పును ముందుకు నడిపేందుకు విన్‌ఫాస్ట్ కట్టుబడి ఉందన్నారు. సరికొత్త ఆవిష్కరణలు, పోటీ ధరలు, విజన్తో భారతదేశాన్ని చక్కటి ఆటోమోటివ్ భవిష్యత్తు వైపు నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.